



ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

అక్రమ జిపిఎతో ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ పరిధిలోని పాపం పేట కాలనీలో వేలాది కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లు, ఇళ్ల స్థలాలపై తప్పుడు పత్రాలు సృష్టించి జిపిఎ పొంది ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వారిని చట్ట పరంగా శిక్షించి న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. పాపం పేట గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, లోక్ సత్తా పార్టీ జిల్లా నాయకులు వేలూరు అశోక్, పాపం పేట పరిరక్షణ సమితి కన్వీనర్ జి.ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చిరంజీవి తదితరులు హాజరై మాట్లాడారు. పాపం పేటలో భూ ఆక్రమణలకు పాల్పడిన వారు అక్కడ నివసిస్తున్న ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారన్నారు. జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ప్రజలకు భరోసానిచ్చి, వారికి భద్రత కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. 'భూములు మావి' అని కొందరు బోర్డులు నాటి దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నా పోలీసు అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాపం పేట గ్రామంలో దశాబ్దాల తరబడి ప్రజలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఈ స్థలాలు పదులు, వందల చేతుల్లో బదలాయింపులు జరిగాయన్నారు. ఇప్పుడు కొందరు వచ్చి శోత్రియం, ఇనామ్ భూములు, తాతల తరపు వారసులం అంటూ ప్రజలకు చెందిన ఆస్తులన్ని తమవే అంటూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడటం అన్యాయంగా ఉందన్నారు. భూదాహంతో కోర్టులను, జిల్లా యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా బరితెగింపు చర్యలకు పాల్పడ్డారని తెలిసినా ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూడటం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ కొలువులో ఉంటూ కొందరూ అధికారులు, ఉద్యోగులు భూ కబ్జాదారులకు సహకరించి తప్పుడు పత్రాలు జారీ చేయడం సహించరానిదన్నారు. జిపిఎ పొందడానికి అవసరమైన పత్రాలు జారీ చేసిన రెవెన్యూ, సర్వే, సబ్‌రిజిస్ట్రార్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే పాపం పేట గ్రామస్తులకు భద్రత కల్పించాలన్నారు. సర్వేయర్ కబ్జాదారులకు సహకరించి తప్పుడు రిపోర్టులను ఇచ్చారని, విఆర్ఓ, సర్వేయర్ పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రలోభాలకు లోబడి సబ్ రిజిస్టర్ భూ కబ్జాదారులకు ప్రోత్సహించే విధంగా వ్యవహరించారని వారి పైన కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాలక పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా ప్రజలకు భద్రత కలిగించే విధంగా వ్యవహరించాలని కోరారు. పాపంపేట పరిరక్షణ సమితి చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం సంపూర్ణమైన మద్దతు ఇస్తుందని తెలిపారు. ధర్నా అనంతరం డిఆర్ఓ మలోలాకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిఆర్ఓ మాట్లాడుతూ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని, తొందరలోనే భూ కబ్జాదారులకు సహకరించిన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎవరైతే భూ కబ్జాదారులకు సహకరించారో వారందరి పైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మన్నీల రామాంజనేయులు, వెంకటనారాయణ, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్ నగర కమిటీ సభ్యులు బాలకృష్ణ, ఓబులేసు, రాజు, రామాంజనమ్మ, గఫూర్, లతీఫ్, అశ్విని, పాపం పేట గ్రామ వాసులు గోపాల్ రెడ్డి, సుబ్బు, శంకర్, హాజీవలి, ఇస్మాయిల్, శంషాద్, నాగేంద్రమ్మ, పద్మావతమ్మ, ప్రసాద్, ఇజ్రాయిల్, రియాజ్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల కొలువు


బొమ్మనహాల్ హాస్టల్‌లో బయట కూర్చొని తింటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - నార్పల

నార్పలలోని సంక్షేమ వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. మండలకేంద్రంలో మూడు సంక్షేమ వసతి గహాలు ఉన్నాయి. స్థానిక దుగ్గుమర్రి రోడ్డులో ఎస్సీ బాలుర హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్ రెండు పక్కపక్కనే ఉన్నాయి. బీసీ బాలికల హాస్టల్ స్థానిక బాలికల పాఠశాల ఆవరణంలో ఉంది. ప్రభుత్వ బాలుర పాఠశాల వసతి గృహంలో 85 మంది విద్యార్థులున్నారు. హాస్టల్‌కు మెయిన్ గేటు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. అదేవిధంగా ఎస్సీ బాలికల హాస్టల్లో 68 మంది విద్యార్థినిలు ఉన్నారు. దుగుమర్రి రోడ్డు వైపు ఉన్న ప్రహరీ నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎక్కడ హాస్టల్లోకి చొరబడుతారోనని విద్యార్థినిలు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక హాస్టల్ పరిసరాల్లో పారిశుధ్యం లోపించింది. మొత్తం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండి ఉంది. దీంతో విష కీటకాలు గదుల్లోకి వస్తాయోనని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బాలికల పాఠశాల ఆవరణంలో ఉన్న బీసీ హాస్టల్‌లోని విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహంలో ప్రస్తుతం 380 మంది ఉన్నారు. ఇంతమంది విద్యార్థినులకు 29 గదులు ఉన్నాయి. ఇంతమంది విద్యార్థులకు కేవలం 20 మరుగుదొడ్లు ఉన్నాయి. విద్యార్థులందరూ పాఠశాలకు వెళ్లడానికి ఒకేసారి సిద్ధమవుతున్న సమయంలో ఈ మురుగుదొడ్లు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన వారు హాస్టల్ పక్కనే మరొక 28 నూతన మరుగుదొడ్లు నిర్మిస్తున్నారని అవి పూర్తి అయితే విద్యార్థులకు ఎటువంటి సమస్య ఉండదని అధికారులు చెప్పారు. విద్యార్థుల పర్యవేక్షణకు ఇద్దరు కాంట్రాక్టు బేసిక్ వర్కర్లు ఒక పర్మినెంట్ వర్కర్ మాత్రమే ఉన్నారు. 2024 జూన్ నుండి ప్రభుత్వం కాస్మోటిక్ ఛార్జీలను చెల్లించడం లేదు.

బొమ్మనహాల్ హాస్టల్‌లో సమస్యల తిష్ట

బొమ్మనహాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్‌లోని బిసి బాలుర వసతి గృహంలో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ వంద మంది విద్యార్థులున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. చిన్నపాటి వర్షం వచ్చినా హాస్టల్ ఆవరణంలో వర్షపు నీరు వచ్చి నీటిగుంటను తలపిస్తుంది. విద్యార్థులు భోజనం చేయడానికి డైనింగ్‌హాల్ లేదు. వంట చేయడానికి గది ఉన్నప్పటికీ వసతులు లేవు. హాస్టల్‌లోకి వెళ్లడానికి దారి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా సరిగా లేదు. హాస్టల్‌లోని భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఐదు నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు.


నార్పల ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లోని నెలకొన్న అపరిశుభ్రత


నార్పల బాయ్స్ హాస్టల్‌కు గేట్‌లేని దృశ్యం


బొమ్మనహాల్‌లో హాస్టల్‌లోకి దారిలేకుండా ఉన్న మట్టిదిబ్బ

ఇనుప గనుల్లో సర్వే

ప్రజాశక్తి - డి. హీరేహాల్

మండలంలోని ఓబులాపురం గ్రామ పరిధిలో ఉన్న ఇనుప గనులను జిల్లా అటవీశాఖ అధికారి గురు ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులాపురం, సిద్దాపురం గ్రామాల పరిధిలో ఉన్న ఓబులాపురం మైనింగ్ కంపెనీ ఏఎంసి, అంతర్ గంగమ్మ, బిఐఓపి మైనింగ్ సరిహద్దుల వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. సర్వే నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తామన్నారు. ఈవిషయంపై ఈనెల 23న న్యూఢిల్లీలో ఒకసారి సమావేశం జరిగిందన్నారు. తిరిగి నవంబర్ 26న రెండవ సమావేశం అనంతపురంలో జరుగుతుందని చెప్పారు. నవంబర్ 10 వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. లేటెస్ట్ టెక్నాలజీ అవైలబుల్ టెక్నాలజీతో ఈ సర్వే కొనసాగుతుందని వివరించారు.


గనులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి గురుప్రసాద్

ముని్సపల్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు పిలుపుమేరకు మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గురువారం వినుత్న నిరసనకు దిగారు. ఇందులో భాగంగా యునియన్ నాయకులు వన్నూర్‌స్వామి, తిమ్మప్ప, దుర్గమ్మ తదితరులు కార్మికులతో కలిసి చెట్లకొమ్మలు, బజారులో లభించే అట్టపెట్టలతో శుభ్రం చేస్తూ నిరసన చేపట్టారు. చాలా నెలలుగా కార్మికులకు రక్షణ పరికరాల ఇవ్వడం లేదన్నారు. దీంతో ఎలా శుభ్రం చేయాలని ప్రశ్నించారు. పరికరాలను మంజూరు చేయకపోవడంతోనే నిరసనకు దిగినట్లు తెలిపారు.


చెట్లకొమ్మలతో పనిచేస్తున్న కార్మికులు

ఇవేం పనులు సారూ..!

విద్యార్థులతో పనులు చేయిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దవడుగూరు

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు వారిచేత పనులు చేయిస్తున్నారు. విద్యార్థులతో గదిలో సిమెంటు పనులు, పేపర్ల తొలగింపు పనులు చేయిస్తున్నారు. మండలంలోని లక్షుంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులతో ఉపాధ్యాయులు పనులు చేయించడంపై పలు విమర్శలు వినపడుతున్నాయి. పాఠశాలలో మరుగుదోడ్లు, గదులను శుభ్రం చేయించేందుకు ప్రత్యేకంగా వర్కర్‌ను కేటాయించగా వారిచేత ఇవేమీ చేయించకుండా విద్యార్థులతోనే పనులు చేయించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గదిలో సిమెంట్ ఎత్తుతున్న విద్యార్థి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఇంటింటికి మంత్రి కార్యక్రమానికి మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగా ఉరవకొండ పట్టణంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే ఆయా శాఖల అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉరవకొండ పట్టణంలోని బోయ వీధి,లాలు స్వామి గుడి, పాత బజారు, కామన్న కట్ట, కొండప్ప బావి, ముగ బసవన్న కట్ట వీధులలో పర్యటించి నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉరవకొండ పట్టణంలో ఇంటింటికి త్రాగునీటి సౌకర్యం కల్పించినందుకు మంత్రి పయ్యావుల కేశవ్‌కు పట్టణంలోని గ్రామీణ బ్యాంక్ వద్ద పట్టణ నాయకులు, ప్రజలు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గుంతకల్లు రోడ్డు నుంచి కనేకల్ రోడ్డు వరకు వేస్తున్న రోడ్డు నిర్మాణం వల్ల ఇల్లు కోల్పోతున్నామని కొంతమంది ప్రజలు మంత్రితో వాపోయారు. దీంతో మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని, రోడ్డు నిర్మాణం వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని తెలిపారు. డీఆర్డీఏ పరిధిలో మన డబ్బులు – మన లెక్కలు కార్యక్రమం కింద మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కింద ఉరవకొండ నియోజకవర్గంలో 240 కోట్ల రూపాయలకు రుణ ప్రణాళిక తయారు చేశామని బ్యాంకు రుణాలు రూ. 178 కోట్లు, రూ.60 కోట్లు స్త్రీనిధి రుణాల ద్వారా మహిళల జీవనోపాదులను మెరుగుపరచుటకు విరివిగా రుణాలు అందజేస్తున్నామని డిఆర్‌డిఎ పీడీ శైలజ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

వీగిన అవిశ్వాసం

గైర్హాజరైన ఎంపిటిసిలు

బుక్కరాయసముద్రం ఎంపిపిపై వీగిన అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల ఎంపిపిపై వైసిపి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం తిరస్కరణకు గురైంది. మండలంలో 19 ఎంపిటిసి స్థానాలు ఉండగా 14 స్థానాలు వైసిపి, ఐదు స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. దీంతో అప్పట్లో ఎంపిపి స్థానం మహిళలకు కేటాయించడంతో రెండున్నరేళ్లు దాసరి సునీ, మరో రెండున్న ఏళ్లు కాలవ వెంకటలక్ష్మికి ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈమేరకు దాసరి సునీతను ఎంపిపిగా ఎన్నుకున్నారు. అయితే నాలుగేళ్ల తర్వాత దాసరి సునీతపై 13 మంది వైసిపి ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం కోరుతూ ఆర్‌డిఒ, జెడ్పీ డిప్యూటీ సిఇఒ, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. దీంతో గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అవిశ్వాస తీర్మానంపై వినతిపత్రం అందజేసిన 13 ఎంపిటిసిల్లో ఒకరు రాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఎంపిటిసిలు సమావేశానికి రాకపోవడంతో అవిశ్వాస తీర్మాన నిర్ణయాన్ని రద్దు చేస్తూ ఆర్‌డిఒ కేశవనాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఐదేళ్లలో ఒకసారి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. కావున తదుపరి ఎన్నికలు వచ్చే వరకూ ఎంపిపిగా దాసర సునీతనే కొనసాగుతారని ప్రకటించారు. అనంతరం తమ ఎంపిటిసిని అవిశ్వాస తీర్మాణానికి రాకుండా కిడ్నాప్ చేశారని వైసిపి సభ్యులు జడ్పిటిసి భాస్కర్‌తో కలిసి బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సిఐ పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచు పార్వతి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మద్దతు : ఎంపిపి

ఎంపిటిసిలు అభివృద్ధికి మద్దతు ఇచ్చారని ఎంపిపి దాసరి సునీత తెలిపారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఎంపిటిసిలు తమకు మద్దతు ఇచ్చారన్నారు. అంతేగానీ తాము కిడ్నాప్ చేశామని వైసిపి సభ్యులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.



బుక్కరాయసముద్రం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న పోలీసు బందోబస్తు

సౌదీ నుంచి 'అనంత' చేరుకున్న నిజాం

సిఎం, మంత్రులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న అనంతపురానికి చెందిన నిజాంను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెప్పిన మాట ప్రకారం అనంతపురానికి తీసుకొచ్చారు. నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన నిజాంపై సౌదీలో ఓనర్లు చిత్రహింసలకు గురి చేశారు. చివరకు అతన్ని బయటికి నెట్టివేయడంతో సౌదీలో తీవ్ర ఇబ్బందులు పడి, చివరకు ఒక వీడియో సందేశం ద్వారా తన ఆవేదనను వెల్లడించారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెంటనే స్పందించారు. మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ఆజాద్ నగర్‌లో ఉన్న నిజాం ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంటనే తన స్నేహితుల ద్వారా సౌదీలోని జెడ్డాలో ఉన్న నిజాంను కలిసేలా చేశారు. అనంతరం వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అసోసియేషన్ వారికి నిజాంను అప్పజెప్పారు. అక్కడ నుంచి అనంతపురం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని అంశాలు అధికారులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం నిజాం సౌదీ నుంచి అనంతపురం చేరుకున్నారు. ఆజాద్‌నగర్‌కు చేరుకోగానే నిజాం కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది నిజాం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడు ఎదుర్కొన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని మీ కుటుంబానికి ఎమ్మెల్యే దగ్గుపాటి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. నిజాం అనంతపురం తీసుకురావడమే కాకుండా ఆయన కుమారుడికి ఆయన వైద్య ఖర్చులను కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎమ్మెల్యే అందిస్తారన్నారు. అలాగే సొంత ఇల్లు కూడా మంజూరు చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం చేసిన మేలు జన్మలో మరువలేదని నిజాం ఉద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు సుందర్, దత్తాత్రేయ ఆలయ కమిటీ ఛౌర్మన్ రాయల్ మధుపాల్గొన్నారు.


సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బిటిపి గేట్లు ఎత్తడంతో

10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ఆందోళనలో ప్రజలు, రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంలో మండలంలోని దాదాపు 10 గ్రామాలకు రాకపోకల్లో అంతరాయం ఏర్పడింది. కర్నాటకలో కురిసిన వర్షాలకు భారీగా వరద రావడంతో భైరవానితిప్ప జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలారు. దీంతో మండలంలోని వేదవతి నది దాదాపు 9 అడుగుల మేర ప్రవహిస్తోంది. ఈనేపథ్యంలో సింగానల్లి నుంచి పొన్నూరు, బొల్లనగడ్డం నుంచి హరేసముద్రం, బుల్లనగుడ్డం నుంచి కురవల్లి, హరేసముద్రం, కల్లుగోలా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. బండూరి నుంచి గౌనూరు వెళ్లాలంటే నది దాటి వెళ్లాలంటే నది దాటలేకపోతున్నారు.ద ఈంతో ఆయా గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్లాలంటే సుమారు 10 నుంచి 15 కిలోమీటర్లు మేర వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతదూరం ఎద్దులను ఎలా తీసుకెళ్లాలని ఆందోళన చెందుతున్నారు.


వేదవతి నదిలో పరుగులు తీస్తున్న నీరు

ముగిసిన సిఎఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ (సిఎఎస్) ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయి. ఇంటర్వ్యూలను గవర్నర్ నామినిగా వివిధ బోర్డ్ అఫ్ సభ్యుల ఛైర్మన్‌లు, సబ్జెక్టుల నిపుణులు, వివిధ అనుభవజ్ఞులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఉప్పరపల్లి విఆర్ఒపై చర్యలు తీసుకోండి

డిఆర్ఒకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సీతారం ఏచూరి కాలనీలో మహిళలపై అసభ్యంగా మాట్లాడిన ఉప్పరపల్లి పంచాయతీ విఆర్ఒ జిలానిఅశోక్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి కాలనీ ప్రజలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 194-8లో సితారం ఏచూరి కాలనీలో మూడేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. అయితే కాలనీకి వచ్చి విఆర్ఒ జిలాని అశోక్ వచ్చి మహిళలతో అసభ్యకరంగా మాట్లాడారని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థలో ఇలాంటి కొందరూ విఆర్ఓ తీరుతో వ్యవస్థకే చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలోకి వచ్చి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మరోసారి ఇలాగే వ్యవహరిస్తే సదరు విఆర్ఓపై మహిళలే తిరగబడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విఆర్ఓపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఇర్ఫాన్, శంకర్, కమిటి సభ్యులు పి.ఇస్రాయిల్, మణి, ప్రసాద్, హరి, నారాయణస్వామి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిలో రాజీపడొద్దు:ఆర్డీవో

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిలో ఎవరూ రాజీపడొద్దని ఆర్డీఓ వసంతబాబు సూచిచారు. గురువానం స్థానిక ఆర్డీఓ కార్యాలయ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజినల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా డీఎస్పీ రవిబాబుతో కలిసి పలుఅంశాలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో విద్యార్థుల సౌకర్యాలు మెరుగు పరచాలని, అవసరమైన చోట్ల ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సహకారంతో నవోదయా, ఏకలవ్య మెడల్ రెసిడెన్సియల్ పాఠశాలలకు ప్రతిపాదనలు పంపామన్నారు. దారిద్ర్యరేఖ దిగువనున్న పది తండాలకు రోడ్లు మంజూరుకై ఎమ్మెల్యే గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదనలు పంపించినట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు

వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఎఎస్‌డబ్ల్యు రామ్మోహన్, డివిజనల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, రామాంజినేయులు, ఎంపిపిలు మారుతమ్మ, భవాని, జెడ్పీటీసీ గుద్దెళ్లనాగరాజు, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న ప్రతి లేఅవుట్‌ను క్రమబద్ధీకరించుకోవాలని అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ స్పష్టం చేశారు. వైస్‌ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అహుడా కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా టిసి వరుణ్ మాట్లాడుతూ అహుడా పరిధిలోని ఎన్టీఆర్ టౌన్‌షిప్, ఎంఐజి లేఔట్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రతి కొనుగోలుదారుడికీ మెరుగైన సేవలు అందించడమే


వినతులను స్వీకరిస్తున్న అహుడా ఛైర్మన్ టిసి వరుణ్

లక్ష్యంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కెఎండి ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత్, సరస్వతి, డిఇ రేవంత్, జెపిఒ హరీష్‌చౌదరి, పబ్లిక్ హెల్త్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఆదేశాల మేరకు నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఎస్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో అనంతపురం వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జిఎం అల్తాఫ్ అలిఖాన్, అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకటకుమార్ సంయుక్తంగా మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కనకానపల్లి మండలం బోయవాండ్ల కొట్టాల రైతు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా దుకాణదారుడు ధరల పట్టికలో స్టాకు పొందుపరచకపోవడం, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కుల నిర్వహణ సరిగా లేకపోవడం గమనించారు. దీనికితోడు ప్రభుత్వ అనుమతి లేని మూడు కంపెనీలకు చెందిన ఎరువులను విక్రయిస్తున్నట్లు తనిఖీలో వెల్లడైంది. ఈ సందర్భంగా మూడు ఆటోల్లో కోరమాండల్ కంపెనీకి చెందిన 120 బస్తాల కాంప్లెక్స్ ఎరువును ఎలాంటి బిల్లులు లేకుండా సరఫరా చేయడాన్ని పరిశీలించి సీజ్ చేసినట్లు ఎడిఎ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.26లక్షలు ఉంటుందన్నారు. అదేవిధంగా దుకాణంలో బేయరు కంపెనీకి చెందిన సొలమన్ 20 లీటర్ల, ఒబెరాన్ 9.5 లీటర్ల క్రిమి సంహారక మందులకు ఎలాంటి ఇన్వాయిస్ లేనందున సీజ్ చేసినట్లు తెలిపారు. దుకాణదారునిపై తదుపరి చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటకుమార్ తెలిపారు.

కోర్టు ఆవరణంలో హైడ్రామా..


బాధితుడు జయరాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జయరామ్ అనే వ్యక్తి గురువారం పెట్రోల్ చేతబట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ హైడ్రామా చేశాడు. విషయం గమనించిన అక్కడున్న పోలీసులు అతని వద్ద ఉన్న పెట్రోల్‌ను లాక్కుని మందలించారు. జడ్జి వద్దకు తీసుకెళ్లడంతో వాగ్మూలం సేకరించారు. కంబదూరు మండలం కొత్తపల్లికి చెందిన జయరామ్ ఆస్తి కోసం తన తల్లిని కొట్టేవాడు. దీంతో కంబదూరు పోలీస్‌స్టేషనలో తల్లి ఫిర్యాదు చేసింది. జయరామ్‌ను స్టేషన్‌కు పిలిపించడంతో పోలీసుల సమక్షంలో తల్లిని మరోసారి కొట్టబోయాడు. ఈవిషయంలో అక్కడున్న పోలీస్ సిబ్బంది అతన్ని మందలించి కూర్చొబెట్టారు. పోలీసులకు తెలియకుండా కళ్యాణదుర్గం చేరుకుని పెట్రోల్ తీసుకుని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోకి ప్రవేశించి హైడ్రామా చేసి అందరినీ ఆందోళనకు గురిచేశాడు. ఈవిషయమై పట్టణపోలీసులు అతని వ్యవహారంపై విచారణచేపట్టారు.

నేటి నుంచి పప్పుశనగ రిజిస్ట్రేషన్ ప్రారంభం

యాడికి : నేటి నుంచి మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో సబ్సిడీ పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభవుతుందని మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసుల ఆయుధాలపై అవగాహన

గుత్తి : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహర్షి దయానంద గురుకులంలో పదో తరగతి విద్యార్థులకు పోలీసుల ఆయుధాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.సురేష్, ఎఎస్ఐ ఆజాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల పరామర్శ

గుత్తి : మండలంలోని ఇరువురు వైసిపి నాయకులను వైసిపి సీనియర్ నాయకులు సిబి మంజునాథరెడ్డి గురువారం పరామర్శించారు. తురకపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కాలుకు గాయం కావడంతో అనంతపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుకి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మంజునాథ్‌రెడ్డి పరామర్శించారు. అలాగే ఈశ్వరపల్లికి చెందిన అనారోగ్యానికి గురైన రామచంద్ర నివాసానికి వెళ్లి పరామర్శించారు.

నగరంలో స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్లు, తృప్తి క్యాంటీన్లు

మెప్మా అధికారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్లతోపాటు తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మెప్మా అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెప్మా అధి.కారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులోఉ భాగంగా మెప్మా విభాగ పరిధిలోని స్మార్ట్ స్ట్రీట్, మార్కెట్లు, తృప్తి క్యాంటీన్లు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, పీఎం సూర్య ఘర్ వంటి పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఆధునిక, సాంకేతికతతో కూడిన అంగళ్లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్లు తీసుకొచ్చిందన్నారు. అలాగే మహిళా పారిశ్రామికవేత్తలకు స్వయం ఉపాధి కల్పించడానికి తృప్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతపురంలో ఎన్ని క్యాంటీన్లు ఏర్పాటు చేస్తారన్నది ఆరా తీశారు. దీనిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే పీఎం సూర్య ఘర్ వలన కలిగే ఉపయోగాలను, ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ విశ్వజ్యోతి, భవాని, మెప్మా టిపిఆర్ఒ నాగ సుబ్బారాయుడు, సిటీమిషన్ మేనేజర్ కాటమయ్య, సిఒలు శ్రీనివాసులు, మనోప్రియ, పార్వతి, రత్నమ్మ, మాధవి, నవదుర్గ, పద్మజ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

రైతన్నలపై నిర్లక్ష్యం తగదు

సబ్సిడీ పప్పుశనగ ఇవ్వాల్సిందే.. - వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-పుట్లూరు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ అన్నారు. రైతులకు రాయితీతో విత్తన పప్పుశనగ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతన్న పట్ల శాపంగా మారిందన్నారు. రైతన్నలు విత్తనాలు, ఎరువుల కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సి వస్తోందన్నారు. వర్షాకాలం అయిపోయినా ఇంతవరకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైన రైతులపై మీ వ్యతిరేక ధోరణిని మార్చుకుని, రైతులకు పప్పుశనగ అందించాలని, లేకపోతే రైతుల పక్షాన నిలబడి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ


వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

కార్యదర్శి తరిమెల గోకుల్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, నాయకులు మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, ఇల్లూరు జయరామిరెడ్డి, పట్నం ఫణీంద్ర, నాగేశ్వరావు, మడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, కడవకల్లు విశ్వనాథ్‌రెడ్డి, అరకటివేముల శ్రీనివాసరెడ్డి, ఎల్లుట్ల శేఖర్, దోసలేడు నరసింహారెడ్డి, శివారెడ్డి, జిల్లా యువజన నాయకులు సొహైల్, గవ్వల సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

ఎమ్మెల్యే పరిటాల సునీత


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం-2లో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. తర్వాత గ్రామ పంచాయతీల్లో నిధుల వివరాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలా ఖర్చు చేశారన్న అంశాలపై చర్చించారు. అన్ని గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే సంకల్పంతో రూ.90కోట్ల నిధులతో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఆరాతీశారు. ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇల్లు లేని ప్రతిఒక్కరూ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, సబ్సిడీలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. మండలంలో సుమారు 18వేల ఎకరాల్లో వాణిజ్య ఇతర పంటలు సాగు చేస్తున్నారని, ఇందులో బొప్పాయి పంట, ఎక్కువగా వైరస్ బారిన పడుతోందన్నారు. దీనిపై రైతులకు శాస్త్రవేత్తలు, అధికారులు తగిన సూచనలు సలహాలు ఇచ్చి రైతులకు అవగాహనా కల్పించాలన్నారు. హంద్రీనీవా, పిఎబిఆర్ కాలువల పరిధిలో ఆత్మకూరు మండలంలోని చెరువులతోపాటు లింక్ కాలువల ద్వారా అనంతపురం రూరల్ మండలంలోని చెరువులకు కూడా సాగునీరు ఇస్తున్నామన్నారు. వేపచెర్ల సమీపంలోని గోపాలప్పకుంటకు నీరు ఇచ్చేందుకు నివేదికలు తయారు చేసినట్లు చెప్పారు. కొందరు అధికారులు సరైన వివరాలతో సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

ప్రజాశక్తి-పామిడి

ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎపి రైతుసంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో 'ఆర్డీటీని కాపాడుకుందాం-జిల్లా ప్రజలను రక్షించుకుందాం' అనే కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కులమతాలకు అతీతంగా సేవలు చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. ఆర్డీటీ మూతబడితే నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. ఇప్పకైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.


ఎద్దులపల్లి రోడ్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎపి రైతుసంఘం నేతలు

కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం


ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని ఎపి కౌలు రైతుసంఘం ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ఎస్‌బిఐ ఎదుట ఆందోళన చేపట్టి బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులందరికీ ఎలాంటి నిబంధనలు లేకుండా ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది రుణాల కోసం బ్యాంకు అధికారుల వద్దకు వెళ్తే రుణాలిచ్చే సమయం గడిచిపోయిందని చెప్పడం బాధాకమరన్నారు. కనీసం ఈసారైనా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు సుంకన్న, ప్రసాద్, లోకేష్, భారతి, సభ్యులు వెంకటేశులు, బండెప్ప, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కౌలురైతుసంఘం నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, రంగారెడ్డి, కమిటీ సభ్యులు జ్ఞానమూర్తి కోరారు. ఈమేరకు గురువారం ఉరవకొండలో పర్యటించిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను సిపిఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా రైతులు బోరుబావులు, కాలువల కింద వేరుశెనగ, కంది తదితర పంటలు సాగు చేశారన్నారు. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా అప్పులు చేసి సాగు చేసిన పంటలు కుళ్లిపోయాయన్నారు. అలాగే తడిసిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఇకపోతే ఉరవకొండలో నూతన డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

కూటమి ప్రభుత్వంపై ప్రత్యక్షపోరు

రైతులపై నిర్లక్ష్యం తగదు-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష పోరుకు సిద్ధమవుతున్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచినా రైతులకు సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వర్షాభావంతో దెబ్బతిన్నాయన్నారు. వేరుశనగ సాధారణ సాగు 4.50 లక్షల ఎకరాలు ఉంటే 2.25 లక్షల ఎకరాల్లోనే సాగైందన్నారు. ఈ పంటలకు కూడా తెగుళ్ల సోకి దిగుబడులు రాని పరిస్థితి ఉందన్నారు. ఈనేపథ్యంలో రబీపై ఆశలు పెట్టుకున్న రైతులకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. సీజన్ అయిపోయాక ఇప్పుడు రిజిస్ట్రేషన్ ప్రారంభించామని అధికారులు ప్రకటనలు చేస్తుండటం బాధాకరమన్నారు. అదేవిధంగా గత వైసిపి హయాంలో 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు అందిస్తే.. నేడు 25 శాతానికి కుదించారన్నారు. గతేడాది జిల్లాకు 27 వేల క్వింటాళ్ల పప్పుశనగ కేటాయిస్తే ఈ ఏడాది కేవలం 14 వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై ఒక్క ప్రజాప్రతినిధి కూడా అడిగిన పాపానపోలేదన్నారు. ఇక అరటి, చీనీ, మామిడి పంటలను కూడా రైతులు రోడ్డుపై పడేస్తున్నారన్నారు. ఇతర పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. గిట్టుబాటు ధర కోసం అధికార పార్టీకి చెందిన రాయదుర్గం ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాసే పరిస్థితి ఉందంటే ఇంతకంటే దారుణం మరొకటి ఉంటుందా..? అని ప్రశ్నించారు. అధికారులు కూడా ప్రజాప్రతినిధుల మెప్పుపొందడం కోసం మాత్రమే పని చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నరగా రైతుల పరిస్థితి చూస్తుంటే గతంలోలా వలసలు, రైతుల బలవన్మరణాలు ఎక్కడ జరుగుతాయోనన్న ఆందోళన కలుగుతోందని ఆవేదన చెందారు. ఇక చాగళ్లు, పీఏబీఆర్, ఎంపీఆర్ నుంచి నీరు ఏటిపాలు అవుతోందన్నారు. ఇటీవల ఐఎబి సమావేశం నిర్వహిస్తే కనీసం ఎన్ని రోజులు నీళ్లు వస్తాయి? ఏ పంటలు వేసుకోవాలో చెప్పలేదన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ సమస్యలపై వైసీపీ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నట్లు హెచ్చరించారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

మొంథా తుఫాన్‌పై జగన్ వీడియో కాన్ఫరెన్స్

మెంథా తుఫాను ప్రభావంపై వైసీపీ జిల్లాల అధ్యక్షులు, రీజనల్ కో ఆర్డినేటర్లతో గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధినేత జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా తుఫాను తర్వాత నెలకొన్న పరిస్థితులు, పంట, ఇతర నష్టంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతపురం నుంచి హాజరైన అనంత వెంకటరామిరెడ్డి జిల్లాలో రైతులు పడుతున్న ఇబ్బందులను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో మొంథా తుఫాను ప్రభావం పెద్దగా లేకపోయినా రైతులు కరువు కోరల్లోకి వెళ్తున్నారని వివరించారు.

హమాలీ యూనియన్ నేత లక్ష్మన్న మృతికి సంతాపం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండలంలో కందుకూరు గ్రామం నివాసి, ఎఫ్‌సిఐ హమాలీ యూనియన్ పూర్వపు కార్యదర్శి లక్ష్మన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలుసుకున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు గురువారం లక్ష్మన్న మృతదేహానికి పూల మాలలు వేసి ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. లక్ష్మన్న హమాలీగా సేవలందిస్తూనే సంఘం చేపట్టిన పోరాటంలో చురుకైన పాత్ర పోషించాడని తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గిరి, ఎఫ్‌సిఐ యూనియన్ పూర్వపు నాయకులు నారపరెడ్డి, చంద్రాయుడు తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.


లక్ష్మన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

4న మండల స్థాయి చెకుముకి పోటీలు

అనంతపురం కలెక్టరేట్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబరాలు నవంబర్ 4న నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెపి.చిత్తప్ప, కె.వీరరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,9,10వ తరగతికి చెందిన విద్యార్థులు ముగ్గురు ఒక టీంగా ఏర్పడి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ విధంగా మొత్తం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో 272 టీంలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. వీరంతా ఈ నెల 18న పాఠశాల స్థాయిలో జరిగిన చెకుముకి సంబరాల్లో మొదటి స్థానంలో వచ్చిన వారని తెలిపారు.

రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీకి సోదనపల్లి విద్యార్థిని

శింగనమల : అమరావతిలో జరిగి రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి మండలంలోని సోదనపల్లి విద్యార్థిని బొమ్మన దీక్షిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సిరాజుద్దీన్ తెలిపారు. గురువారం నార్పల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 'భారత రాజ్యాంగం'పై నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో బొమ్మన దీక్షిత మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో రాష్ట్ర మాక్ అసెంబ్లీకి ఎంపికైన దీక్షితను ప్రధానోపాధ్యాయులు సిరాజుద్దీన్ , ఉపాధ్యాయులు బాలచెన్నారెడ్డి, వెంకటసుబ్బయ్య, ముబీనా, మధు, చంద్రమోహన్, రజనీకుమారి, నాగరాజు, శివశంకరయ్య, కృష్ణ, గంగాభవాని, పరిమళ, బయపరెడ్డి, హేమలత, రాజేష్, మాజీ సర్పంచు అట్టే రామాంజినేయులు, చిన్నచౌడప్ప, ఈస్ట్ నరసాపురం ఆదినారాయణనాయుడు, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు అభినందలు తెలిపారు.


విద్యార్థినిని అభినందిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

డ్రెయినేజీ శుభ్రం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఉన్న డ్రెయినేజీని పంచాయతీ కార్మికులు గురువారం తొలగించారు. 15 రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల చెత్త, కంపచెట్లతో డ్రెయినేజీకి అడ్డు పడటంతో మురుగునీరు పోకుండా ఆగిపోయింది. దీంతో పంచాయతీ కార్మికులు డ్రెయినేజీని శుభ్రం చేయడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రోజువారి పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ బాలస్వామి గురువారం గడియారం స్తంభం వద్ద కాంపాక్టర్ ద్వారా పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్న చెత్త పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా కమలానగర్, పోలీస్ కాంప్లెక్స్ ప్రదేశాల్లో ఉన్న కాలువల్లో పూడికలను తీసివేసే పనులను పరిశీలించారు. ఆయా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని 3వ సర్కిల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ ను ఆదేశించారు. తర్వాత టవర్‌క్లాక్ ఫ్లైఓవర్, నడిమివంక, బళ్లారి బైపాస్ రోడ్డు, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, రామ్‌నగర్ ప్రధాన రహదారుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. అక్కడి నుంచి బళ్లారి రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించి అల్పాహార నాణ్యత, పరిసరాల శుభ్రతను పరిశీలించారు.

'చిత్రావతి' నుంచి 2వేల క్యూసెక్కుల నీరు విడుదల


కిందికి పరుగులు తీసుకున్న నీరు

యల్లనూరు : పార్నపల్లి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు రిజర్వాయర్ డిఇ చంద్రసురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 9.8 టిఎంసిలు కాగా అంతకు మించి ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తుండటంతో ఒక గేటు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన రాజన్న

నార్పల : మండలంలోని గూగూడు వద్ద జంగంరెడ్డిపల్లి రోడ్డు సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గూగూడు గ్రామానికి చెందిన సప్లయర్స్ రోశన్న గారి రాజన్న (60) ద్విచక్ర వాహనంలో నార్పల నుంచి స్వగ్రామానికి గూగూడుకు వస్తుండగా ద్విచక్ర వాహనంలో ఎదురుగా వచ్చిన కళ్యాణ్, విజయ్‌కుమార్ జంగంరెడ్డిపల్లి సమీపంలో ఢీకొన్నారు. దీంతో అందరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రలను 108లో అనంతపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మద్యం స్వాధీనం

పుట్లూరు : మండల పరిధిలోని గురుగుచింతలపల్లి గ్రామంలో పోలీసులు మద్యాన్ని పట్టుకున్నారు. గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు గురువారం వెళ్లి దాడి చేసి మంజుల, నాగేంద్ర నుంచి 21 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో యువకుడికి అస్వస్థత

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే యువకుడికి గురువారం పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రాజశేఖర్ గ్రామ శివారులో తన స్నేహితులతో మాట్లాడుతూ రోడ్డు పక్కన నిలబడ్డాడు. అయితే పక్కనున్న పొదల్లో నుంచి వచ్చిన పాము రాజశేఖర్ కాలికి కాటు వేసింది. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శిరీష అనే మహిళ గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యాసరచన పోటీలు

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం నియోజకవర్గస్థాయిలో భారత రాజ్యాంగం, విశిష్టత, ప్రాధాన్యతపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, నగేష్, జయరామ్‌రెడ్డి, శ్రీదేవి, షఫీ, నాగేంద్ర, ప్రధానోపాధ్యాయులు, నార్పల ఎంఆర్‌సి సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, శాంతప్రకాష్‌రెడ్డి, బ్రహ్మ, సునీత, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే

యాడికి : మండల పరిధిలోని పెద్దపేట గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, డ్రై డే ఫ్రైడే గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జుబేదా, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, హెల్త్ అసిస్టెంట్ శరత్, ఎఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్త మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఏర్పాటు చేసిన సేవా శిబిరంలో భాగంగా గురువారం మండలంలోని నేత్రపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయదుర్గానికి చెందిన వైద్యులు శ్రీరామిరెడ్డి, రామ్మోహన్ కలిసి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ శిబిరం అధికారి-2 కోదండరాములు, నేత్రపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విజయకుమార్, చంద్రశేఖర్, కిరణ్, గోవర్ధన, నాగరాజురెడ్డి, బాల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం పాఠశాలలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి అండర్-14, 17 బాల బాలికల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులు శుక్రవారం కళ్యాణదుర్గంలో జరిగే డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో గుత్తి డివిజనల్ డిప్యూటీ డిఇఒ మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వెంకటరాముడు, వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, తిమ్మరాజు, రాఘవేంద్ర, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల భవన మరమ్మతులకు విరాళం

కళ్యాణదుర్గం టౌన్ : స్థానిక పెన్షనర్ల భవనంలో మౌలిక సదుపాయాల కోసం విరాళం అందించారు. ఈమేరకు దాత ప్రమీళ రూ.10వేల విరాళాన్ని పెన్షనర్ల భవనంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, తిప్పేస్వామి, పాండురంగ, మరెన్న, ఇస్మాయిల్, హంపన్న, కృష్ణమూర్తి తదితరులకు అందజేశారు. తన తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రామచంద్రప్ప జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు ఆమె తెలిపారు.

విత్తనపప్పుశనగకు రిజిస్ట్రేషన్

పుట్లూరు : మండలంలో మొదటిరోజు గురువారం పప్పుశనగల కోసం 75 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఏవో కాత్యాయని తెలిపారు. కాగా ప్రభుత్వ సబ్సిడీ శనగలు ధర క్వింటా రూ.5,850 ఉంది. అయితే బయట మార్కెట్‌లో కూడా రూ.5,800 నుంచి రూ.6వేల వరకూ ఉండటంతో రైతులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు మొక్కు చూపుతుండటం విశేషం.



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటామని వైసిపి నాయకులు సిబి మంజునాథ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పి.ఎర్రగుడి, అనగానిదొడ్డి, బ్రాహ్మణపల్లి, పూలకుంట, ఈశ్వరపల్లి, తురకపల్లి, పెద్దొడ్డి గ్రామాల్లో ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి సుందరమ్మ, ఎంపిటిసిలు సుమలత, చిన్న వీరన్నగౌడ్, కౌన్సిలర్లు వి.వరద, వాల్మీకి శివ, నరేష్, వైసిపి నాయకులు జి.గోవర్ధన్‌రెడ్డి, సివి రంగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, రామరంగారెడ్డి, ఎ.దస్తగిరి, డి.షఫీ, వై.రామసుబ్బారెడ్డి, మల్లికార్జున, వై.రాజశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రంగస్వామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, హనుమంతురెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుమార్, ప్రవీణ్, బలరామిరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అనంతపురం : మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు నగర సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ సమీపంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి జివి లింగారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నల చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ నితిన్‌రెడ్డి, విద్యార్థి విభాగం మాజీ జిల్లా అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, హేమంత్‌యాదవ్, కుమ్మర సురేష్, మన్నల సతీష్, సాకే వేణుగోపాల్, మన్నల రమేష్, మన్నల విష్ణువర్ధన్, అకుతోటపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కెయు వద్ద సంతకాలు సేకరిస్తున్న వైసిపి నేతలు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో రూ.18.50 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ గురువారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. అనంతరం రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న అదనపు భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికారి ప్రతినిధి శశాంక్‌బాబు, యాలేరు సొసైటీ అధ్యక్షుడు కృష్ణమోహన్‌చౌదరి, బోదపాటి హరి, కందల ఓబుళపతి, అక్కులన్న, రామదాసు, ఆదెప్ప, తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతమ్మ

శిథిలావస్థ భవనాలు పరిశీలన



భవనాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

కళ్యాణదుర్గం టౌన్ : స్థానిక డ్వామా కార్యాలయంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను జెడ్పీ సీఈఓ శివశంకర్ గురువారం పరిశీలించారు. భవన పైకప్పులు ఊడిపడుతుండటంతోపాటు వర్షం వస్తే కారుతుండడంతో పంచాయతీరాజ్ శాఖ నిర్మాణపు పనులను చేపట్టింది. ఇందులో భాగంగా భవనాలను పరిశీలించి వెంటనే మరమ్మతులను పూర్తి చేయాలని సూచించారు.

'శ్రీసాయి'లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని అశోక్ నగర్‌లో ఉన్న శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో శక్తి యాప్, డయల్ 100, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్, సామాజిక మాధ్యమాలపై పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ కిరాణా షాపులు, గ్రైండర్ మిషన్లకు వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులు ఇచ్చే పదార్థాలను తినకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ సుభద్ర, కుసుమ పుల్లారెడ్డి, తాడిమర్రి రామకృష్ణారెడ్డి, పుట్లూరు కేశవరెడ్డి, ఎర్రగుంట రఘునాథరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అత్యుత్తమ వైద్యం కోసం ప్లానింగ్ ఇవ్వాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గర్భిణుల ప్రమాదకర పరిస్థితులను గుర్తించి వైద్యాధికారులు, స్కానింగ్ ద్వారా అత్యుత్తమ వైద్యం అందించేందుకు బర్త్ ప్లానింగ్ ఇవ్వాలని డిఎంహెచ్‌ఒ ఇబి దేవి సూచించారు. గురువారం రాయదుర్గం మండల పరిధిలోని ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండల పరిధిలోని టి.వీరాపురం గ్రామానికి చెందిన గర్భిణి తులసి ఈనెల 25వతేదీన కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రిలో ప్రసవించగానే బేబీ మరణించినట్లు దినపత్రికల్లో కథనాలు రావడంతో తనిఖీకి వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బాలింతకు సంబంధించి నమోదైన రికార్డులు, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. ఇకపై నవజాతా శిశువులు మరణించడానికి వీల్లేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మాధవమోహన్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ త్యాగరాజు, సూపర్‌వైజర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎపిటిఎఫ్ అనంతపురం రూరల్ మండల నూతన కమిటిని ఎన్నుకున్నట్లు ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ తెలిపారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ మండల కమిటి కార్యవర్గం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఎపిటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా జి.రంగారెడ్డి, మండల అధ్యక్షులుగా కలిముల్లా, ఉపాధ్యక్షులుగా ఆదినారాయణ స్వామి, కుళ్లాయప్ప, ప్రవీణ, ప్రధాన కార్యదర్శిగా ఓబన్న, కార్యదర్శులుగా గోపాల్ నాయక్, గీతావాణి, కుళ్లాయి బాబు, రామక్క, ఆడిట్ కన్వీనర్లుగా నాయుడు, శ్రీనివాసులు, ఇంద్రాణి, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.సూర్యనారాయణ, డి.ఓబులేసు, మంజునాథ, ఎస్.షేక్షావలి, వన్నూరప్ప, బి.మోహన్ రెడ్డి, ఏ.శారద దేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ కుమార్, సర్దార్ వలి, ఆడిట్ కన్వీనర్ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



నూతన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ముళ్లపొదల తొలగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు గురువారం మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మద్దానేశ్వర స్వామి ఆలయ రహదారిని శుభ్రం చేశారు. అలాగే రహదారికి ఇరువైపులా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద దట్టంగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణీంద్రకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబులేసు, కళాశాల అధ్యాపకులు వీరేష్, శ్రీనివాసులు, వెంకటేశులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, అవి వ్యాపించడం వల్ల కలిగే అనారోగ్య లక్షణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, మలేరియా నివారణ సూపర్‌వైజర్లు ఎర్రిస్వామి, సూర్యనారాయణ, రవిరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హేమలతా, కళాశాల అధ్యాపకులు బాబు, గురుమూర్తి, కిరణ్, వినోద్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముళ్ల కంపలను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

వార్డెన్ రవీంద్రనాథ్ ఠాగూర్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గుత్తి : పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో వార్డెన్‌గా పని చేస్తూ ఇటీవల మృతిచెందిన రవీంద్రనాథ్ ఠాగూర్‌కు గురువారం హరిత దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్, రమణ, భాస్కర్, మణికంఠ, చంటి, రాజు, ధరణి, కుమార్, అశోక్, బాబురావు, గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.